క్లుప్తంగా

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి : నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం జరగనుందని కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ బుధవారం తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన దాచేపల్లి-1 సచివాలయంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందని, పలు అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, నగర పంచాయతీ అధికారులు ఈ సమావేశంకు హాజరుకావాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సీడీపీవో రుక్సానా సుల్తానా బేగం

గురజాల : బాలింతలు, గర్భిణులు మంచి పోషకాలతో కూడిన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో రుక్సానా సుల్తానా బేగం అన్నారు. మండల పరిధిలోని పులిపాడు సెక్టారు గంగవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉండే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎస్సీలను మోసం చేసింది చంద్రబాబే

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

దాచేపల్లి : చంద్రబాబు ఎస్సీలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరుపాగు రాజశేఖర్ బుధవారం అన్నారు. చంద్రబాబు సీఎంగా పనిచేసిన సమయంలో ఎస్సీలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందకుండా అడ్డుకున్నారని, ఈ రోజు చంద్రబాబు జైలుకి వెళితే ఎస్సీలు ఆందోళన చేయటం దురదృష్టకరమన్నారు. ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని స్వయంగా చంద్రబాబే అన్నారని, ఎస్సీలను అవమానించిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు అన్ని విధాలుగా అండగా ఉన్నారని, ఎస్సీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారని రాజశేఖర్ చెప్పారు. రానున్న రోజుల్లో ఐక్యమత్యంగా ఉండి మన అభివృద్ధికి బాటలు వేసిన సీఎం జగన్‌కు అండగా ఉండాలని ఆయన కోరారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

గురజాల : మైనర్ బాలికపై అత్యాచారం చేసి ఆమె మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వడ్డెర కార్మిక సంఘం నాయకుడు నీలంరాజు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలో చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని శిక్షించి రాష్ట్రంలో మరలా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వడ్డెర కార్మికులు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. అతి కిరాతకంగా బాలికను లైంగికంగా ఇబ్బందులకు గురిచేసిన వారిపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఆ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గీత రచనలో పిడుగురాళ్ల కవికి ద్వితీయ బహుమతి



పిడుగురాళ్ల: మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీత రచన పోటీలకు ఆహ్వానించారు. ఈ పోటీల్లో మొత్తం 285 మంది కవులు వారి గీతాలను ఆన్‌లైన్ ద్వారా మండలి ఫౌండేషన్‌కు పంపించారు. వీరిలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వైహెచ్‌కే మోహన్‌రావుకు విరబూసిన మల్లె వనం గీత రచనకు ద్వితీయ బహుమతి లభించింది. దీంతో పట్టణంలోని పలువురు ప్రముఖులు వైహెచ్‌కే మోహన్‌రావును అభినందించారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి



మాచర్ల: రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులకు న్యాయం చేస్తామని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఆ తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులను గుర్తించారని విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.సుందరప్రసాద్‌చారి అన్నారు. బుధవారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగిన సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రభుత్వానికి 8 డిమాండ్లు పెట్టామని, టీడీపీ ఒక్క సమస్యనూ పట్టించుకోలేదన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర స్థాయి పండుగగా గుర్తించారన్నారు. వివిధ సమస్యలను పరిష్కరించారన్నారు. మిగతా సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని సుందరప్రసాద్‌చారి కోరారు. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులకు ఎల్ఎంసీ పదవిని ఇస్తామని హామీనిచ్చారన్నారు. దీంతో పాటు విశ్వబ్రాహ్మణులకు అన్ని హక్కులు కల్పించి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వి.పరబ్రహ్మాచారి, నియోజకవర్గ అధ్యక్షులు కె.నాగేశ్వరచారి, గౌరవాధ్యక్షులు వెంకటాచారిలు మాట్లాడారు. అనంతరం విశ్వబ్రాహ్మణులు తమ సంఘాన్ని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్యాం సుందర్, వీరబ్రహ్మాచారి, బ్రహ్మాచారి, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్



కామేపల్లి గ్రామంలో భూ సర్వే నిర్వహిస్తున్న సర్వే బృందం



రైతులకు భూ సర్వేపై అవగాహన కల్పిస్తున్న సర్వే బృందం

- రెవెన్యూ అధికారులు సమాచారం అందించినప్పుడు రైతులు పొలాల వద్ద హాజరు కావాలి
- 22ఏ లిస్ట్‌లో ఉన్న భూములు కూడా సర్వే

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతే రాజుగా ఉండాలన్న సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలను పరిష్కరించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బ్రిటిష్ కాలంలో జరిగిన భూ సర్వే సుమారు 100 సంవత్సరాల తర్వాత నేడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం భారీ వ్యయంతో ఎక్కడా లోపాలు జరగకుండా రైతులకు శాశ్వత భూ హక్కు కల్పించే కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల మండలంలోని కాలేపల్లి గ్రామంలో మూడవ ఫేజ్ రీ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మొదటి, రెండు దశల్లో మండలంలోని చిన్న అగ్రహారం, పెద అగ్రహారంలో భూములకు రీ సర్వే నిర్వహించి రైతుల భూమికి నాలుగు వైపులా హద్దులు కేటాయించి ప్రభుత్వ ఖర్చుతోనే హద్దు రాళ్లను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలోనే మూడవ దఫాలో భాగంగా కామేపల్లి, బ్రాహ్మణపల్లి శివార్లలో ఉన్న సుమారు 4 వేల ఎకరాలకు భూ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

నాలుగు బృందాలుగా రీ సర్వే...

రీసర్వే త్వరగా నిర్వహించేందుకు తహసీల్దార్ ఎంవీ చక్రవర్తి ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి రీ సర్వే నిర్వహిస్తున్నారు. ఒక్కో బృందంలో స్థానికంగా ఉన్న సచివాలయ సర్వేయర్, వీఆర్వోలు, ఆర్ఐలు, సర్వేయర్ అసిస్టెంట్‌లు ఉంటారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం...

రైతుల భూములకు శాశ్వత పరిష్కారానికి ఈ సర్వే దోహదపడుతుంది. సర్వే బృందం రైతులకు సంబంధించి, అనుభవదారులకు సంబంధించిన భూమిని రోవర్ సహాయంతో కొలతలు నిర్వహించటం ద్వారా ఖచ్చితంగా ఒక్క అంగుళం కూడా తేడా రాకుండా హద్దులను కేటాయించి రైతుల కళ్ల ముందే పొలాలకు హద్దు ఏర్పాటు చేయటంతో చిన్న చిన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

శాశ్వత భూ హక్కు పత్రాలు...

భూములకు సర్వే నిర్వహించిన అనంతరం సంబంధిత రైతులకు ప్రభుత్వం శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తుంది. ఆ పత్రాలు హై క్వాలిటీతో ఎప్పటికి చెక్కుచెదరకుండా ఉండేవిధంగా బార్ కోడ్‌తో శాశ్వత పత్రాలు అందజేస్తారు. ఆన్‌లైన్‌లో బార్ కోడ్‌ను స్కాన్ చేస్తే రైతు పేరు, ఎకరాలు, హద్దు దారులు, రైతుకు కేటాయించిన సర్వే నెంబర్‌తో సహా పూర్తి సమాచారం కనిపిస్తుంది.

నకిలీలకు చెక్...

ఇప్పుడు నిర్వహిస్తున్న రీ సర్వే ద్వారా శాశ్వత భూ హక్కు పత్రాలతో రైతులకు నకిలీల నుంచి విముక్తి కలుగుతుంది. ఆన్‌లైన్‌లో తమ పేరు ఉందా లేదా, ఎవరైనా తొలగించారా అనే సమస్య లేకుండా రైతు సంతోషంగా తమ భూమిని అనుభవిస్తూ ధైర్యంగా ఉండే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహింపజేస్తున్నారు.

ప్రతి రైతు సద్వినియోగ పరచుకోవాలి



రీ సర్వేను ప్రతి రైతు సద్వినియోగ పరచుకోవాలి. సర్వే బృందం రైతులకు ఒక రోజు ముందుగానే నోటీసుల ద్వారా సమాచారం ఇస్తారు. సర్వే సమయంలో సర్వే బృందానికి సహకరించి వారి వద్ద పత్రాలు నకలు, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, బ్యాంక్ ఖాతా నెంబర్, ఆధార్ నెంబర్ అందజేయాలి. రైతులకు సంబంధించిన భూమి సర్వే అనంతరం హద్దులు ఏర్పాటు చేసి శాశ్వత భూ హక్కు పత్రాన్ని రైతులకు అందించటం జరుగుతుంది.

– ఎంవీ చక్రవర్తి, తహసీల్దార్, పిడుగురాళ్ల

దుర్గి స్టోన్ కార్వింగ్‌కు ఉత్తమ ప్రతిభా పురస్కారం



పర్యాటక శాఖామంత్రి రోజా చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

దుర్గి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంలో అందించే ఉత్తమ ప్రతిభ పురస్కారాలకు గాను దుర్గి స్టోన్ కార్వింగ్‌కు ప్రతిభ పురస్కారం దక్కింది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖామంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నట్లు దుర్గి నాగార్జున శిల్పశాల నిర్వాహకుడు చెన్నుపాటి శ్రీనివాసరావు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాముఖ్యత కల్పిస్తూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గి క్వారీలో లభిస్తున్న స్టోన్ కార్వింగ్‌కు పర్యాటక రంగంలో ఉత్తమ ప్రతిభ పురస్కారం లభించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుర్గి స్టోన్‌కు మంచి గుర్తింపు రావటానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పలువురు అభినందించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన ఓసీ, బీసీ కమిటీల నియామకం



కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు

మాచర్ల: జాతీయ గ్రామీణ పేద మహిళా సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మాచర్ల మండల కమిటీ నియమించినట్లు జాతీయ వ్యవస్థాపకులు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధే లక్ష్యంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాధికారమే బహుజన మహిళల అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాజ్యాంగంలో బహుజన మహిళలకు హక్కులు రాశారని వాటిని ఉద్యమాల ద్వారా సాధించుకోవాలన్నారు. బీసీ, పేద ఓసీలకు మండల కమిటీలు నియమించారు. అధ్యక్షురాలు బుర్రి అనురాధ, సెక్రటరీ పొట్టి ఇందిరా యాదవ్, ఉపాధ్యక్షురాలు రచ్చమల్ల పద్మ యాదవ్, కొర్రెబోయిన నాగలక్ష్మి నాయుడు, మండల ఇన్‌చార్జి ఆలేటి సత్యం, పగడాల శ్యామల, పగడాల కృష్ణవేణి నాయుడు తదితరులున్నారు.

విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీపీ జి.వి.

మాచర్ల: ప్రతి విద్యార్థి ఉన్నత దశకు చేరుకోవాలంటే విద్యపై ఏకాగ్రతతో ఉండి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే దిశగా విద్యనభ్యసించాలని, విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు దూరంగా ఉండి చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలని, మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ గొర్ల వెంకటేశ్వర్లు (జీవీ) కోరారు. బుధవారం పట్టణంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, ఇతర వ్యాపకాలపై శ్రద్ధ చూపితే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగే అవకాశాలు కోల్పోతారన్నారు. ప్రస్తుత కాలంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే శ్రద్ధగా చదువుకోవాలన్నారు. మహిళలు, విద్యార్థినులను శారీరకంగా ఇబ్బంది పెడితే దిశ యాప్ ద్వారా వారిని రక్షించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, షేక్ నాగుర్‌వలి, పలువురు న్యాయవాదులు తదితరులున్నారు.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు



కేసానుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కారెంపూడి: స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల సందర్భంగా పర్యాటక ప్రాంతమైన వీరుల గుడి పరిసరాలలో బుధవారం చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రపరచి బ్లీచింగ్ చల్లారు. వీరుల గుడి ఆవరణతో పాటు గుడి లోపల కూడా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్, గ్రామ కార్యదర్శి కసిన్యానాయక్, పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఇనుపరాజు పల్లె గ్రామంలో కూడా గ్రామ సర్పంచ్ తగరం బుజ్జమ్మాయి శేఖర్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పర్యవేక్షణలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేశారు. మురుగు కాల్వల్లో పూడిక తీయడంతో పాటు బ్లీచింగ్ చల్లి గ్రామ పరిసరాలను శుభ్రం చేసే పనులు నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

దాచేపల్లి : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ వినుకొండ కొటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కేసానుపల్లిలో విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, ప్రధానోపాధ్యాయుడు చెట్టిపాగు ఏసురత్నం, ఉపసర్పంచ్ కోట కొండలు, నాయకులు నెల్లూరి కోటేశ్వరావు, ఉల్లేరు హనుమంతరావు, చెట్టిపాగు పాపయ్య, మీసాల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న సీఐ , ఎస్ఐ తదితరులు

గురజాల : వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పల్నాడు శాంతి రక్షక వినాయక ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జన కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 9 రోజులు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. డీఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యంలో సీఐ బాలకృష్ణ, ఎస్ఐలు అనంతకృష్ణ, అశోక్ బాబుల ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాశం హనిమిరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

తల్లిదండ్రులు క్రీడలను ప్రోత్సహించాలి



అండర్-17 త్రోబాల్ జట్టుకు ఎంపికైన ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు

రెంటచింతల: విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని అప్పుడే ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్ అన్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రమైన దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బాలుర త్రోబాల్ అండర్-17 జట్టుకు విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు ఆటలలో కూడా ప్రోత్సహించాలన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు తగిన శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని దీంతో వారు ఎంచుకున్న రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధితో పాటు పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ షేక్ సుభానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను అరికట్టాలి

నకరికల్లు: బాలికలపై లైంగింక వేధింపులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు షేక్ ఫాహిం అన్నారు. మండలంలోని చేజర్ల ఎస్‌పీఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎవరైనా.. అసభ్యంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, బంధువులకు, ఉపాధ్యాయులకు, మహిళా పోలీసులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఫోక్సో యాక్ట్, దిశ చట్టం మహిళలకు, బాలికలకు అండగా ఉంటుందని అన్నారు. దిశ యాప్‌ను ప్రతీ ఒక్కరూ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

నిందితులకు ఉరి శిక్ష విధించాలి

సత్తెనపల్లి: చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం గ్రామంలోని వడ్డెర సామాజిక వర్గానికి చెందిన ఇంటర్ విద్యార్థినిని క్రూరంగా హత్య చేసిన నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా విచారణ జరిపి, వెంటనే ఉరి శిక్ష విధించాలని సత్తెనపల్లి వడ్డెర సంఘం ప్రెసిడెంట్ వేముల వరప్రసాదరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లోని వడ్డెర సత్తెన్న విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారికి బుధవారం వినతి పత్రం అందించారు.

దుర్గి గణేష్ లడ్డూ రూ.85,500



దుర్గిలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విజయపురిసౌత్‌లో గణేష్ లడ్డూను దక్కించుకున్న యజ్జల శ్రీను, మత్స్యకారుల యువసేన సభ్యులు

దుర్గి: దుర్గి గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి 9 రోజులుగా పూజలు చేసి బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి విశేష పూజలను చేశారు. మార్కాపురం డప్పు శ్రీను ఆధ్వర్యంలో పాట కచేరి విశేషంగా ఆకర్షించింది. 3వేల మందికి పైగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులుగా నిత్యం పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిస్తూ కోలాహలంగా కొనసాగింది. పలువురు దంపతులు, మహిళా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. 21 కేజీల గణేష్ లడ్డూకు వేలంపాట నిర్వహించగా దుద్దుకూరి సాలయ్య రూ.85,500 కైవసం చేసుకున్నారు. గ్రామంలో వినాయకుని ఊరేగింపు నిర్వహిస్తూ బుగ్గవాగు డ్యాంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.62 వేలు పలికిన మత్స్యకారుల గణేష్ లడ్డూ

విజయపురిసౌత్: స్థానిక డౌన్‌మార్కెట్‌లోని మత్స్యకారుల యువసేన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూ 62 వేల రూపాయలు పలికింది. బుధవారం నిర్వహించిన వేలం పాటలో లడ్డూను యజ్జల శ్రీను రూ.62 వేలకు దక్కించుకున్నారు. భక్తులు ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వేలం పాటలో గణేష్ లడ్డూను యజ్జల శ్రీను రూ.62 వేలకు దక్కించుకోగా, కలశ చెంబును చెల్లూరి కాశిబాబు రూ.35,500, రూ.వంద నోట్ల దండను ఓసిపల్లి రాజారావు రూ.32వేల, వెలగకాయను సోరడ రాజేష్ రూ.26,500, రూ.పది నోట్ల దండను జి.కాశిబాబు 20,500 రూపాయలకు, రూ.20 నోట్ల దండను యజ్జల తాతారావు 20వేల రూపాయలకు దక్కించుకున్నారు. అనంతరం అంగరంగ వైభవంగా గ్రామ పురవీధుల్లో గణనాథుడి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు నృత్యాలు చేస్తూ బాణసంచా కాలుస్తూ గణనాథుడ్ని అంబేద్కర్ సెంటర్, లాంచీస్టేషన్, డౌన్‌మార్కెట్, ఫిల్టర్‌హౌస్ ప్రాంతాల్లో ఘనంగా ఊరేగించారు. గణేష్ విగ్రహాన్ని సాగర్ నూతన వంతెన వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేశ్వరావు, మైలపల్లి మల్లిఖార్జున, కొర్లయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



భట్రుపాలెంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుచరిత



చింతపల్లిలో ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

దాచేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వేగంగా జరుగుతోందని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సుచరిత తెలిపారు. నగర పంచాయతీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వే ఆరోగ్య సిబ్బంది బుధవారం నిర్వహించారు. మండలంలోని భట్రుపాలెంలో జరిగిన ఈ సర్వేలో డాక్టర్ సుచరిత పాల్గొని రక్త, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. త్వరలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తామని, ఈ క్యాంప్‌లో గుర్తించిన రోగాలకు వైద్య సేవలు ఉచితంగా అందిస్తామని డాక్టర్ సుచరిత చెప్పారు. ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వచ్చి ఈ సర్వే చేస్తారని, రోగాలతో బాధపడే వారు వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సర్వేలో డాక్టర్ అమూల్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

కారెంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపల్లి గ్రామంలో బుధవారం గాదెవారిపల్లె పీహెచ్‌సీ సిబ్బంది సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటిలో 40 ఏళ్ల పైబడిన వారికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఏదైనా అనారోగ్య సమస్య ఉన్న వారికి జగనన్న సురక్ష టోకెన్‌ను అందించారు. ఈ టోకెన్ పొందిన వారికి వచ్చే నెల 10వ తేదీ నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ కె.సాగర్, ఏఎన్ఎం కె.రాణి, ఆశ వర్కర్లు రమాదేవి, పరిశుద్ధం, జ్యోతి, జయకుమారి, పీహెచ్ఎస్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేయండి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు, వైద్యులు

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అన్ని సచివాలయాల పరిధిలో సర్వేను విజయవంతం చేసేలా కృషి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలాల పురపాలక సంఘాలతో వివిధ పథకాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేతో పాటు గృహ నిర్మాణ పథకం, డ్వాక్రా సంఘాలకు చేయూతతో పాటు పలు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి ఒక్కరికీ అందించేందుకు అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఆయా కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సచివాలయాలతో సమన్వయం చేసుకొని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబు, వైద్యులు, ప్రాథమిక కేంద్రాల వైద్యులు, సిబ్బంది, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్ ప్రమాద బీమా చెక్కు అందజేత



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యామర్తి హనుమయ్య అనే రైతు గత నెల 27న విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం జరిగింది. డాక్టర్ వైఎస్సార్ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును మృతుని భార్య కోటేశ్వరమ్మకు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం అందజేయడం జరిగింది. ఇటీవల మృతుని కుటుంబాన్ని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పరామర్శించి, ప్రభుత్వం ద్వారా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా అందించే ప్రమాద బీమా త్వరగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు త్వరితగతిన ఆర్థిక సాయం అందేలా చేశారు. బీమా చెక్కు త్వరగా వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, రైతులను ఆదుకునేందుకు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి హనుమయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లమ్మ తనయుడు ఆంజినేయులు, ఎంపీటీసీ సత్యన్నారాయణ, ఉపసర్పంచ్ చిన అంజి, యార్డు డైరెక్టర్ రాము, సచివాలయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.